సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



అడవి బిడ్డలం.. అభివృద్ధి కనం

నేటికీ గిరిజన గూడేల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. విద్య, వైద్యం, తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. IIలో▸



కల్వర్టు నిర్మాణానికి కృషి

మందమర్రి మండలం పులిమడుగు గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేక్ అన్నారు. గురువారం ఆయన చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
31.0 /25.0

వాతావరణం

ఉదయం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రివేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

మాఫీపై గందరగోళం!

- సహకార సంఘాల్లో సిబ్బంది పొరపాట్లు
- వాస్తవ సొమ్ము కంటే అధికంగా ఖాతాల్లో నమోదు
- మంచిర్యాల పరిధిలో రైతు ఫిర్యాదుతో వెలుగులోకి..
- గుర్తించకుంటే సర్కారు ఖజానాకు భారీగా నష్టం



మంచిర్యాల పీఏసీఎస్ కార్యాలయం



మంచిర్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో అధికారుల విచారణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సహకార సంఘాల్లో రుణమాఫీలో అవకతవకలు, అక్రమాలు జరిగాయంటూ వస్తున్న ఫిర్యాదులు ఆ శాఖ అధికారులను గందరగోళానికి గురి చేస్తున్నాయి. ఇటీవల ఇద్దరు రైతుల ఫిర్యాదుపై మంచిర్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరిధిలో అవకతవకలు జరిగినట్లు మొదట అధికారులు, రైతులు సందేహాలు వ్యక్తం చేయడం తెలిసిందే. రుణాల పునరుద్ధరణ సమయంలో జరిగిన పొరపాట్లతో రైతు సిరిపెల్లి బాపు ఖాతాలో అధిక మొత్తంలో నమోదు కాగా, మరో రైతు కందుల లక్ష్మణ్ రుణాల విషయంలో సంఘం అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతోనూ ఈ పరిస్థితి నెలకొంది. ఈ ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన అధికారులు విచారణ అధికారిని నియమించి దర్యాప్తు చేయించి నివేదిక సమర్పించారు. జిల్లాలో మొత్తం 20 సహకార సంఘాలు ఉండగా, 15సంఘాలు సహకార బ్యాంకు పరిధిలో, మరో ఐదు ఎస్‌బీఐ పరిధి(సీడెడ్)లో ఉన్నాయి. వీటి పరిధిలో ఇంకా ఎన్ని చోట్ల ఇలాంటి తప్పిదాలు జరిగాయోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సిబ్బంది నిర్లక్ష్యంతోనే..

సహకార సంఘాల్లో రుణాల ప్రక్రియ చెల్లింపుల సమయంలో సంబంధిత అధికారులు రైతుల రుణాల చెల్లింపులు, పునరుద్ధరణ సమయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా చేసిన తప్పిదాలే ఇందుకు కారణమైనట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రాథమిక సహకార సంఘాల్లో రైతుల రుణాలను ఏటా రెండుసార్లు రెన్యూవల్(రీషెడ్యూల్) చేస్తుంటారు. ప్రతీ ఆరు నెలలకోసారి ఈ ప్రక్రియ జరుగుతుంది. రైతులు చాలామంది వడ్డీలు కట్టుకున్నా, తీసుకున్న రుణానికి ఆర్నెల్లకోసారి వడ్డీ కలిపి రుణ పునరుద్ధరణ చేస్తుంటారు. అలా ఫిర్యాదు చేసిన రైతు రుణానికి తీసుకున్న మొత్తాన్ని, వడ్డీ జమ చేసే చోట అసలుతో కలిపి వేయడంతో వాస్తవ రుణం కంటే ఎక్కువగా నమోదవుతూ వచ్చింది. 2021 నుంచి అధిక మొత్తమే నమోదవుతూ వచ్చింది. దీంతో ఆ మొత్తానికి సర్కారు రుణమాఫీ చేసినట్లు ఫోన్‌కు మెస్సేజ్ వచ్చింది. దీంతో తీసుకున్న మొత్తం కంటే ఎక్కువగా వచ్చాయని ఆ రైతు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయగా, రుణాల పునరుద్ధరణ సమయంలో జరిగిన తప్పిదమే ప్రధాన కారణమని గుర్తించినట్లు తెలిసింది.

మరో 14ఖాతాలపైనా అనుమానాలు..

ఇక మంచిర్యాల ప్రాథమిక సహకార సంఘ పరిధిలోనే 14మంది రైతుల ఖాతాలకు సంబంధించి రుణాలు చెల్లించినప్పటికీ బ్యాంకులో జమ కాలేదని గుర్తించినట్లు తెలిసింది. ఈ నెల 7న ఆదిలాబాద్ కేంద్ర సహకార బ్యాంకు నుంచి మంచిర్యాల జిల్లా సహకార అధికారికి మంచిర్యాల ప్రాథమిక సహకార సంఘ సెక్రెటరీ అవకతవకలకు పాల్పడ్డారనే అనుమానాలు వ్యక్తం చేస్తూ సంబంధిత ఆ ఖాతాలను పంపింది. వీటిపైనా విచారణ జరుగుతోంది. చాలామంది రైతులు రుణాలు తీసుకుని రశీదు పొందకపోవడం, కంప్యూటర్లలో నమోదు చేయకపోవడం వంటివి జరిగినట్లు తెలుస్తోంది. విచారణ పూర్తయితేనే అక్రమాలు జరిగాయా? లేవా? అనేది తేలుతుందని అధికారులు చెబుతున్నారు.

సర్కారు ఖజానాకు నష్టం

సహకార శాఖలో కింది స్థాయి చేసిన అధికారుల నిర్లక్ష్యం, తప్పిదాలతో సర్కారు ఖజానాకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. రైతుల రుణాలు రూ.వేలల్లో ఉండడంతో జిల్లా పరిధిలోనే రూ.కోట్లలో నష్టం జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా సభ్యుల రుణాలు, వడ్డీ చెల్లింపులు, రీషెడ్యూల్, రుణమాఫీ వివరాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయిస్తే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కాకుండా ఉండడంతోపాటు సంఘాల్లోనూ గందరగోళానికి తావుండదని రైతులు కోరుతున్నారు.

నివేదిక అందజేశా

మంచిర్యాల ప్రాథమిక సహకార సంఘ పరిధిలో ఇద్దరు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ పూర్తి చేసి జిల్లా సహకార శాఖ అధికారికి నివేదిక అందజేశాను. ఆ మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు. వీటితోపాటు 14బ్యాంకు ఖాతాలు అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించడంతో వాటిపైనా ప్రస్తుతం విచారణ జరుగుతోంది. దీనిపైనా త్వరలో నివేదిక అందజేస్తా.

– ఏవీఆర్‌డీ ప్రసాద్‌రావు, విచారణ అధికారి

విచారణ చేపడుతాం

ప్రాథమిక సహకార సంఘాల్లో ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే అన్నింటిపైనా విచారణ చేపడుతాం. మంచిర్యాల పరిధిలో ఇద్దరు రైతుల ఫిర్యాదులపై జరిపిన విచారణ నివేదిక కలెక్టర్‌కు అందజేస్తాం. మంచిర్యాల సంఘ పరిధిలోని రుణ ఖాతాలపై మొత్తం తనిఖీలు చేయిస్తాం. జిల్లాలో ఇంకా ఎక్కడైనా ఇలాంటివి మా దృష్టికి వస్తే విచారణ చేయిస్తాం.

– బి.రామ్మోహన్, జిల్లా సహకార శాఖ అధికారి

భద్రత, బాధ్యత మాదే..

- రామగుండం సీపీ శ్రీనివాసులు
- షీటీమ్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణలో సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: భద్రత మాదే.. బాధ్యత మాదే అంటూ వినిపించే పోలీసు రింగ్‌టోన్‌ను నిజం చేసేందుకు పోలీసు యంత్రాంగం సాంకేతిక పరిజ్ఞానంతో మరింత ముందుకెళ్తోందని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. గురువారం రామగుండం పోలీసు కమిషనరేట్ ఆవరణలో షీటీమ్స్, సైబర్‌క్రైమ్, టీ సేఫ్ యాప్, చైల్డ్‌లైన్, గంజాయి ఏదైనా సమాచారం అందించడం కోసం ప్రజల్లో చైతన్యం కల్పించడానికి రూపొందించిన వాల్‌పోస్టర్లను సీపీ శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రో కార్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈవ్‌టీజింగ్, అత్యవసర పరిస్థితుల్లో కమిషనరేట్ కంట్రోల్ రూం నంబర్ 8712656597, షీ టీమ్ నంబర్ 6303923700కు కాల్ చేసి సమచారం అందించాలని అన్నారు. చట్టవ్యతిరేఖ కార్యక్రమాలు, గంజాయి, పేకాట, కోడి పందేలు, గుడుంబా, అక్రమ రవాణా, ఉద్యోగాల పేరిట మోసం, భూ కబ్జాలపై 8712656597, 8712656607 నంబర్లకు సమాచారం అందించాలని, సైబర్ క్రైమ్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి ఎస్సై హైమ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుళ్లకు రెయిన్‌కోట్‌లు పంపిణీ

మంచిర్యాలక్రైం: కమిషనరేట్ పరిధిలోని ఏఆర్ పోలీస్ కానిస్టేబుళ్లకు సీపీ ఎం.శ్రీనివాసులు గురువారం కమిషనరేట్ క్వార్టర్‌లో రెయిన్‌కోట్‌లు అందజేశారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని, ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు దామోదర్, కన్న మధు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

క్రీడలతో మానసిక ఉల్లాసం

- జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు



క్రీడలు ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. ఆగస్టు 15ను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని న్యాయస్థానంలో గురువారం న్యాయవాదులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు తమ జీవన ప్రయాణంలో, విధి నిర్వహణలో మానసిక ఒత్తిడికి గురవుతారని అన్నారు. క్రీడలు, యోగా, వాకింగ్, జాగింగ్ చేయాలని సూచించారు. అనంతరం క్యారం బోర్డ్ ఆడి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జూనియర్ సివిల్ జడ్జి సంపత్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వని, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిరోష, న్యాయవాదులు పాల్గొన్నారు.

తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు హెల్త్‌క్యాంపు



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం 9గంటలకు తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల కోసం మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ అధ్యక్ష, కార్యదర్శులు కంకణాల భాస్కర్‌రెడ్డి, చందూరి మహేందర్, కోశాధికారి కె.సత్యపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్యనిపుణులు, మంచిర్యాలలోని మహాలక్ష్మీ డెంటల్ ఆసుపత్రి వైద్యుడు రాజశేఖర్, డాక్టర్ అభిషేక్, పిల్లల ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ రఘువంశీ పరీక్షలు చేస్తారని తెలిపారు. క్యాంపు కోసం బ్లడ్‌శాంపిల్ ఇచ్చి, పేర్లు నమోదు చేసుకున్న తలసేమియా, సికిల్‌సెల్, సికిల్‌తాల్ రోగులు హాజరు కావాలని తెలిపారు.

పడ్తనపల్లిలో బీజేపీ రచ్చబండ



దరఖాస్తులు స్వీకరిస్తున్న రఘునాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. రుణమాఫీ కాని రైతుల వివరాలతోపాటు వారి సంతకాలు సేకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ పడ్తనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ రైతులకు రుణమాఫీ వర్తించకపోవడం దారుణమని అన్నారు. మంత్రి పదవి కోసం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హైదరాబాద్, ఢిల్లీలో పైరవీలకు పరిమితమయ్యారని, నియోజకవర్గ రైతులకు రుణమాఫీ ఎందుకు కాలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లేదని ఆరోపించారు. బీజేపీ నాయకులు మోటపలుకుల తిరుపతి, బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి, మడిపెల్లి సత్యం, ఎనగందుల కృష్ణమూర్తి, రమణారావు, రజనీశ్‌జైన్, హనుమాండ్ల శ్రీనివాస్, జూపాక ధర్మయ్య, అంకం శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సేవలందించాలి



పంటను పరిశీలిస్తున్న డీఏఓ కల్పన

జన్నారం: రైతులకు అందుబాటులో ఉండి సూచనలు, సలహాలు, వ్యవసాయ పరంగా సేవలందించాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన సూచించారు. గురువారం మండలంలోని కవ్వాల్ వ్యవసాయ క్లస్టర్‌లో పర్యటించారు. పంటల నమోదుపై పరిశీలన చేశారు. ఏఈఓ అక్రముల్లాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రాగన్ ఫ్రూట్, పత్తి, వరి, ఆయిల్‌ఫామ్ తోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతీరోజు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. పంటల రుణమాఫీ జరిగిన రైతులు బ్యాంకులకు వెళ్లి రెన్యూవల్ చేయించుకోవాలని తెలిపారు.

చేపపిల్లలు కొనాల్సిందే..!

- కొనుగోలు చేసి చెరువుల్లో వదులుతున్న వైనం
- మత్స్యకారులకు ఆర్థిక భారం
- నీలివిప్లవంపై నీలినీడలు



కొనుగోలు చేసిన చేపపిల్లల ప్యాకెట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే చేపపిల్లల పంపిణీ నీలివిప్లవం నీరుగారిపోతోంది. ఇంకా టెండర్లు ఖరారు కాకపోవడంతో చేపపిల్లల సరఫరా ఉంటుందో లేదో తెలియని గందరగోళం నెలకొంది. దీంతో మత్స్యకారులే తలా కొంత నగదు పోగు చేసుకుని చేపపిల్లలు కొనుగోలు చేసి చెరువులు, కుంటల్లో వదులుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి. జూలై 18 నుంచి 27 వరకు విస్తారంగా కురిసిన భారీ వర్షాలతో జలాశయాలు కొన్ని మత్తడి దూకాయి. ఈ నెలలో ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే చేపపిల్లలు వదిలితే వేసవికాలం నాటికి మంచి ఎదుగుదలతో మత్స్యకారులకు లాభం చేకూరుతుంది. గడువులోగా వేసుకుంటే చేపపిల్లలు ఎదిగి మంచి దిగుబడి వస్తుందని, ఆర్థికంగా భారమైనా కొనుగోలు చేయక తప్పడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

పంపిణీ లేక..

మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు జిల్లాలో నీటి వసతి కలిగిన చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలు వదిలేందుకు ప్రభుత్వం జూలైలో ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాలో ఈ ఏడాది చెరువులు, కుంటలు 363, చిన్న, పెద్ద ప్రాజెక్టులు తొమ్మిదింటిలో 2.18కోట్ల చేపపిల్లలు పంపిణీ చేయాలని మత్స్యశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎల్లంపల్లి, సుందిళ్ల ప్రాజెక్టుల్లో రొయ్యపిల్లలూ పంపిణీ చేయాలని నిర్ణయించారు. చేపపిల్లల్లో 35ఎంఎం పరిమాణం గలవి 1.28కోట్లు, 80 నుంచి 100ఎంఎం పరిమాణం గల చేపపిల్లలు 90లక్షలు జలాశయాల్లో వదిలేందుకు ప్రణాళిక రూపొందించారు. రహు, బొచ్చ, మ్రిగాల వంటి చేపపిల్లల ద్వారా 11,459 టన్నుల చేపల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. జిల్లాలో 128 మత్స్యకార సంఘాలు, 7400 మంది పురుష, మహిళా సభ్యులు ఉన్నారు. ఇప్పటికే చెరువులు, కుంటల్లో చేపపిల్లలు వదలాల్సి ఉండగా.. ఇప్పటికీ ఆ ఊసే లేదు. సకాలంలో వదిలితే వేసవి కాలం నాటికి మంచి పరిమాణంతో పెరిగి దిగుబడి వచ్చి మత్స్యకారులకు ఆర్థికంగా మేలు జరిగేది. తప్పనిసరి పరిస్థితుల్లో మత్స్యకారులు చేపపిల్లలను కొనుగోలు చేసి చెరువులు, కుంటల్లో వదులుతున్నారు.

గతంలో అక్రమాలు..

గతంలో చేపపిల్లల పంపిణీలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. చేపపిల్లలను సకాలంలో పంపిణీ చేయకపోవడంతో ఎదుగుదల లేక మత్స్యకారులు పెద్దయెత్తున నష్టపోవాల్సి వచ్చింది. ప్రజాధనం దుర్వినియోగం అయిందనే విమర్శలు వచ్చాయి.

తలా ఇంత వేసుకొని కొంటున్నాం..

పోయిన నెలలో ఎడతెరిపి లేకుండా పది రోజులపాటు కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగు పోసినయి. ఇప్పుడు వర్షాలు తగ్గుముఖం పట్టినయి. ఇప్పటికే చేపపిల్లలు వేస్తే ఎండాకాలం వరకు మంచిగా ఎదిగి నాలుగైదు కిలోల వరకు పెరుగుతయి. మంచిలాభం వస్తుంది. మేమే కొనుగోలు చేసి వేయాలనుకుంటున్నాం.

– ఎల్లల రాజేష్, నెన్నెల, మత్స్యకారుడు

చేపపిల్లలు ఇవ్వడం లేదు

చెరువులు, కుంటల్లో నీళ్లు నిండినయి ఉచితంగా వచ్చే చేపపిల్లలు ఇవ్వడం లేదు. ఆలస్యమైతే చేపలు ఎదుగవు, మురికి నీరు ఉన్నప్పుడే వాటికి మంచి తిండి దొరుకతది. చేపలు పట్టడం మా జీవనోపాధి. ఆలస్యం అవుతుందని మాకు ఆర్థిక భారమైనా రూ.1500 నుంచి రూ.2000 వేసుకుని పిల్లలు తెప్పించుకుని చెరువులు, కుంటల్లో వేసుకోవాలని జమ చేస్తున్నాం.

– మంచర్ల మల్లేష్, మత్స్యకారుడు, నెన్నెల

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

- జిల్లాకు ఇండస్ట్రీయల్ పార్క్, ఐటీ హబ్ మంజూరు
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

పాతమంచిర్యాల: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వేంపల్లి, పోచంపల్లి గ్రామాల శివారులో ఇండస్ట్రీయల్ పార్కు 250 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. ఇందులో 150 ఎకరాల్లో చిన్న, మధ్యతరహా, పెద్ద పరిశ్రమలు, 30 ఎకరాల్లో ఆటోనగర్, 50 ఎకరాల్లో ఐటీ హబ్ ఏర్పాటు కానుందని చెప్పారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్ని రకాల వనరులు పుష్కలంగా ఉన్నాయని, ఖనిజాలు, బొగ్గు పరిశ్రమ, నీరు, రోడ్లు, రైలు మార్గాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి జాప్యం లేకుండా భూమి కేటాయిస్తామని, బ్యాంకుల ద్వారా రుణాలు, ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ డాక్టర్ జి.మల్సూర్, టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిఖిల్‌చక్రవర్తి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మధు, చాంబర్‌ఆఫ్ కామర్స్ సభ్యులు గుండా సుధాకర్, జుగల్ కిషోర్, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి, పోచంపాడు రెవెన్యూ ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కుకు అనువైన దాదాపు 292 ఎకరాల భూములను ఇండస్ట్రియల్ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. గురువారం హైదరాబాద్ నుంచి వచ్చిన డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ మల్సూర్, టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిఖిల్‌చక్రవర్తి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సేకరణకు సిద్ధంగా ఉన్న భూముల వివరాలను ఆరా తీశారు. హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, గిర్దావర్‌లు మంగ, ప్రభు, సర్వేయర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

రీటెండర్లతో నిధులు మిగిలినట్లే..!

- గత నెలలో టెండర్లలో కాంట్రాక్టర్ల సిండికేట్
- వెలుగులోకి రావడంతో రద్దు
- 16శాతం తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ రూ.2.39 కోట్లతో 43 రకాల అభివృద్ధి పనులకు గాను గత నెలలో ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించారు. కానీ కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి పాలకవర్గ సభ్యులతో కలిసి పనులు పంచుకోగా.. ఈ విషయం బయటకు పొక్కింది. దీంతో టెండర్లు రద్దు చేసి రీటెండర్లు నిర్వహించారు. తద్వారా మున్సిపాలిటీకి రూ.32 లక్షల నిధులు మిగిలాయి. వివరాలిలా ఉన్నాయి. గతంలోనే 43 రకాల పనులు గుర్తించి ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించారు. ఒక్కో వార్డుకు రూ.5 లక్షల నుంచి ఆ పైన నిధులు కేటాయించారు. సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు, డ్రెయినేజీలపై ర్యాంపుల నిర్మాణం పనులు చేయాలని నిర్ణయించారు. మున్సిపల్ కార్యాలయంలోనే గత నెల 3న కాంట్రాక్టర్లు, పాలకవర్గ సభ్యులు సమావేశమై టెండర్లకు పోటీ ఉండవద్దని, ఒక్కో వార్డుకు ఒక్కో కాంట్రాక్టర్ పని చేసుకునేలా డ్రా తీస్తూ పనులు కేటాయించారు. ఈ విషయం బయటకు పొక్కడంతో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ టెండర్లు రద్దు చేశారు. రీటెండర్లలో సిండికేట్‌కు అవకాశం లేకపోవడంతో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 2వరకు టెండర్లు వేశారు. ఆయా టెండర్లను ఓపెన్ చేయగా, కాంట్రాక్టర్లు పోటీ పడి 8 నుంచి 16శాతం వరకు లెస్ వేశారు. ఈ లెక్కన దాదాపుగా రూ.37 లక్షల వరకు నిధులు మిగలనున్నాయి. 23వ వార్డులోని స్లాటర్ హౌజ్ వద్ద టెండర్ పిలిచిన రూ.5 లక్షలతో చేయాల్సిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను టెండర్ల కంటే ముందుగానే చేయగా, ఆ విషయం కూడా బయటకు రావడంతో ఆ పనిని ఎవరికీ కేటాయించలేదు. దీంతో 42 అభివృద్ధి పనులకు రూ.32 లక్షల వరకు మున్సిపల్‌కు నిధులు మిగిలినట్లయ్యింది.

పర్యావరణహితంలో భాగస్వాములు కావాలి



ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీలో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పర్యావరణ హితంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఈవో యాదయ్య అన్నారు. గురువారం జిల్లా సైన్స్ కేంద్రంలో 50 పాఠశాలలకు చెందిన 8, 9వ తరగతుల విద్యార్థులు 150 మందికి ఎల్ఈడీ ట్యూబులైట్ల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ పాఠశాలల్లో ఏకో క్లబ్ ఏర్పాటు చేసుకుని సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ, సేవ్ సాయిల్ నినాదాలతో అనునిత్యం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు స్వయంగా ట్యూబ్‌లైట్లు తయారు చేయడం శుభసూచకం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, మండల విద్యాధికారులు పోచయ్య, మహేశ్వర్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పఠన సామర్థ్యాలకు కృషి చేయాలి

మంచిర్యాలఅర్బన్: ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో పఠన సామర్థ్యాల అభివృద్ధికి కృషి చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. గురువారం మంచిర్యాల బాలుర పాఠశాలలో మండల నోడల్, క్లస్టర్ అధికారులకు రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో ఎఫ్ఎల్ఎన్‌పై అవగాహన కల్పించారు.


సున్నపురాయి గనికి పర్యావరణ అవార్డు



అవార్డు అందుకుంటున్న అధికారులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ సున్నపురాయి గని పర్యావరణానికి సంబంధించి ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డు సాధించింది. కంపెనీ అధికారులు గురువారం ప్రకటించారు. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్(ఐబీఎం), మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎల్లయ్య, ఓరియంట్ సిమెంట్ కంపెనీ అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్ ఎస్.పి సహరే అవార్డు అందుకున్నారు. ఎఫ్‌వై 2022–23లో 5స్టార్ రేటింగ్‌లో దేశవ్యాప్తంగా 68గనులకు అవార్డులు అందించి సత్కరించగా.. రాష్ట్రంలో ఐదు గనులు అవార్డు అందుకున్నట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ సుస్థిర అభివృద్ధి నిబంధనలకు అనుకూలంగా తవ్వకాలు చేపడుతున్న గనులకు అవార్డులు అందించారని, దేవాపూర్ సున్నపురాయి గని వరుసగా రెండుసార్లు అవార్డు పొందిందని తెలిపారు.

పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

నస్పూర్: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. పట్టణ పరిధిలోని 12, 23వ వార్డుల్లో గురువారం నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో డ్రెయిన్‌ల నిర్మాణం, సీసీ రోడ్లు, తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 23వ వార్డులో మెప్మాకు భవనం నిర్మాణానికి హామీ ఇచ్చారు. అనంతరం వారు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురమిల్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీష్, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, అధికారులు కిషన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెటాలియన్‌లో శిక్షణ కానిస్టేబుళ్లకు అస్వస్థత?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కొందరు శిక్షణ కానిస్టేబుళ్లు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. బెటాలియన్‌లో 560 మంది కానిస్టేబుళ్లకు ఫిబ్రవరి 22న రామగుండం పోలీస్ కమిషనరేట్ సీపీ శ్రీనివాసులు చేతుల మీదుగా శిక్షణ ప్రారంభమైంది. గత ఏడు నెలలుగా కానిస్టేబుళ్లుగా కఠిన శిక్షణ పొందుతున్నారు. ఇటీవల కొందరు తమ ఇళ్లకు వెళ్లి వచ్చినట్లు తెలుస్తోంది. ఇక వర్షాలతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో శిక్షణ కానిస్టేబుళ్లు కొందరు జ్వరాలతోపాటు దగ్గు, జలుబుతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. పదుల సంఖ్యలో అనారోగ్యం బారిన పడగా ప్రత్యేక వైద్య సహాయం అందిస్తున్నట్లు సమాచారం. కాగా, శిక్షణ కానిస్టేబుళ్లు కారోనా బారిన పడ్డారని, కొందరిని ఇంటికి పంపించారని బెటాలియన్ పరిధిలో వదంతులు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

పార్కింగ్ చేసి ఉన్న కారు అద్దాలు ధ్వంసం

తాండూర్: తాండూర్ బస్టాండ్ ప్రాంతంలోని ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న కారు అద్దాలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఎస్సై సీహెచ్ కిరణ్‌కుమార్ తెలిపారు. బస్టాండ్ ఏరియా ప్రాంతంలో నివాసం ఉంటున్న చిలుముల శ్రీధర్ తన ఇంటి కారును పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలను పగులగొట్టి ధ్వంసానికి యత్నించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్: గంజాయి సాగు చేస్తున్న వ్యక్తికి పది సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పు చెప్పారు. జైనూర్ సీఐ అంజయ్య తెలిపిన వివరాల మేరకు జైనూర్ మండలం చింతకర్రలోని కిషన్‌నాయక్ తండాకు చెందిన జాదవ్ తిరుపతి తన వ్యవసాయ క్షేత్రంలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం మేరకు 2021 అక్టోబర్ 2న జైనూర్ సీఐ సీహెచ్ తిరుపతి తనిఖీ చేయగా సుమారు 200 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. ఈ క్రమంలో నిందితుడిపై కేసు నమోదైంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్ రావు సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. డీఎస్పీ సదయ్య, జైనూర్ సీఐ అంజయ్య, ఎస్సై సందీప్, కోర్టు లైజనింగ్ అధికారి రామ్‌సింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

కల్వర్టు పైనుంచి కిందపడి వృద్ధుడు మృతి

లక్సెట్టిపేట: ప్రమాదవశాత్తు కల్వర్టు పైనుంచి కిందపడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరుకు చెందిన ఆసాది ప్రభాకర్ (90) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం మధ్యాహ్నం సమీపంలోని కిరాణా దుకాణానికి వెళ్లి కల్వర్టుపై కూర్చున్నాడు. ప్రమాదవశాత్తు కిందపడడంతో మృతి చెందాడు. మృతుని భార్య ఏసుమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి ఒకరు మృతి

దండేపల్లి: ట్రాక్టర్ కిందపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెల్గనూర్ పంచాయతీ పరిధిలోని అందుగులపేట శివారులో ఓ పంట పొలంలో గురువారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పొలంలో కేజీవీల్స్‌తో దమ్ము కొడుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి ఎర్రవేని లచ్చన్న(47) మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

• గిరిజన గూడేల్లో కానరాని మౌలిక వసతులు
• తాగునీటికి తప్పని తండ్లాట
• విద్య, వైద్యపరంగానూ వెనుకబాటు
• హక్కుల కోసం ఆగని అడవిబిడ్డల ఆక్రందన
• నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

వాగులోని నీటిని తీసుకెళ్తున్న నార్నూర్ మండలంలోని బొజ్జగూడ గ్రామ మహిళలు



అడవి బిడ్డలం.. అభివృద్ధి కనం!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వివరాలు
ఐటీడీఏ పరిధిలోని మండలాలు : 77
ఆదివాసీ గిరిజన కుటుంబాలు: 67,648
ఆదివాసీ గిరిజన జనాభా: 4,84,790

కైలాస్‌నగర్: అడవిలో పుట్టి... అడవిలో పెరిగి.. అడవితల్లి ఒడిలోనే సాగుతున్న వైవిధ్యమైన జీవన ప్రయాణం. రోజురోజుకు సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్నా తమ ఆచార వ్యవహారాలను పదిలపర్చుకుంటూ కొండకొనల నడుమ ప్రకృతి తో మమేకమై జీవనం సాగించే అమాయకత్వం ఆదివాసీల సొంతం. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 76 పూర్తికావచ్చినా ఆదివాసీల జిల్లాగా ముద్రపడిన ఆదిలాబాద్ జిల్లాలోని అడవిబిడ్డల జీవన ప్రమాణాల్లో మాత్రం మార్పురావడం లేదు. ఇప్పటికీ తాగునీటికి తీవ్ర తండ్లాట నెలకొనగా విద్య, వైద్యపరంగా వెనుకబాటు తప్పడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమ హక్కులు, అస్తిత్వం కోసం అడవిబిడ్డలు చేస్తున్న ఆక్రందన మాత్రం ఆగడం లేదు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9ని 'అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం'గా ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీల ఆచార వ్యవహారాలు, జీవన శైలిపై 'సాక్షి' అందిస్తున్న కథనం...

ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇబ్బంది

ఆదివాసీలకు విద్యపరంగా వెనుకబాటు తప్పడం లేదు. గిరిజనులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వాలు ప్రతిపాదనలు చేస్తున్నప్పటికీ ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఏళ్లుగా ఉపాధ్యాయుల నియామకాలు లేకపోవడంతో టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో సీఆర్టీలతోనే బోధన సాగిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ చదువుకునే పరిస్థితులు అందుబాటులోకి రాలేదు. టీటీసీ, ఏఎన్‌ఎం శిక్షణ కేంద్రాలను ఏజెన్సీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదనలు రూపొందించినా అమలుకు నోచుకోవడంలేదు. ఐటీడీఏ పరిధిలోని డీఎడ్ కళాశాలను మూసివేశారు. ఉట్నూర్ కేంద్రంగా మంజూరైన గిరిజన యూనివర్సిటీని ఇతర జిల్లాకు తరలించడంతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయమే జరిగింది. ఉన్నత విద్యావకాశాలు లేక ఆదివాసీలు నష్టపోవాల్సి వస్తోంది.

వర్షాకాలం... కష్టాలమయం

ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గూడేల్లో నివసించే ఆదివాసీలకు వర్షాకాలం కష్టకాలమనే చెప్పుకోవాలి. 170కు పైగా గూడేలకు ఇప్పటికీ విద్య, వైద్యం, తాగునీరు, రోడ్డు రవాణా వ్యవస్థ వంటి సౌకర్యాలు లేవు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగులు, వంకలు ఉప్పొంగి రోజుల తరబడి బాహ్య ప్రపంచానికి దూరం కావాల్సిన దుస్థితి నెలకొంది. వాగులు దాటుతూ ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. సరైన రోడ్లు లేకపోవడం, ఉన్న రోడ్లు బురదమయంగా మారడంతో అత్యవసర పరిస్థితుల్లో గూడేలకు 108, 104, 102 వాహనాలు కూడా రాలేని దుస్థితి. ప్రాణాల మీదకు వస్తే ఎడ్లబండ్లు, మంచాలపై రోగులను వేసుకుని వాగులను దాటించి తీసుకెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలంలో గర్భిణులకు వైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉమ్మడి జిల్లాలో వరద కష్టాలకు వాగులు, వంకలు దాటలేక వైద్యం అందక 45 మంది గర్భిణులు, 32 మంది నవజాత శిశువులు, 17 మంది బాలింతలు చనిపోయారు. రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. పలు ఆదివాసీ గ్రామాల్లోనూ ఇప్పటికీ కరెంట్ వసతి లేకపోవడంతో అంధకారంలోనే కాలం వెళ్లదీస్తున్నారు.



రోడ్డును బాగుచేసుకుంటున్న భీంపూర్ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామస్తులు

వేసవిలో చెలిమే నీరే దిక్కు

వేసవికాలం వచ్చిందంటే ఆదివాసీలు తాగునీటికి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ఇంటింటికీ శుద్ధ జలం అందిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటున్నా ఇప్పటికీ అనేక గ్రామాలకు తాగునీరు అందడం లేదు. ఫలితంగా కిలో మీటర్ల దూరంలో ఉన్న చేదబావులు, వాగుల్లోని చెలిమెల నుంచే ఎడ్లబండిపై డ్రమ్ములు కట్టి, నెత్తిన బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని గిరిజన గూడేల్లో ఈ దుస్థితి మరింత ఎక్కువగా ఉంది.

ఆగని అడవిబిడ్డల ఆక్రందన

జల్..జంగల్ ..జమీన్ నినాదంతో సాగిన భూపోరాటం స్ఫూర్తిగా ఆదివాసీలు ఏళ్లుగా తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. 1/70, పెసా చట్టాల ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు భూములపై సర్వహక్కులు ఉంటాయి. ఆర్‌ఓఎఫ్ఆర్-2006 చట్టం ప్రకారం భూములను సాగు చేస్తున్న ఆదివాసీలకు ప్రభుత్వం హక్కుపత్రాలు అందించినప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదు. దీంతో తమపై అటవీ అధికారుల వేధింపులు పెరిగాయని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనలు చేపడుతూనే ఉన్నారు.

సిరికొండ మండలంలోని కుంటగూడ, పాలవాగు గ్రామాలకు వెళ్లే రోడ్డు దుస్థితి



రోడ్డు సౌకర్యంలేక బాలింతను వాగు దాటిస్తున్న వైద్యసిబ్బంది



అధికారుల వేధింపులు ఆపాలి



ప్రభుత్వం ఆర్‌వోఎఫ్ఆర్ కింద గిరిజనులకు హక్కుపత్రాలు ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదు. పలు పత్రాల్లోనూ పొరపాట్లు జరగడంతో రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు పొందలేకపోతున్నారు. ముఖ్యంగా అటవీ అధికారుల వేధింపుల నుంచి గిరిజనులను కాపాడాలి. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలి.

– గోడం గణేశ్, తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు

ఆదివాసీల అభ్యున్నతికి కృషి



ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధికోసం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టాం. దాన్ని పకడ్బందీగా అమలు చేసేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణనిస్తున్నాం. బైక్ అంబులెన్స్‌లను త్వరలో ప్రారంభిస్తాం. హైమన్‌డార్ఫ్ కోచింగ్ సెంటర్‌లో నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణనిస్తున్నాం.

– ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ పీవో

సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా నిరసన

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ గురువారం న్యూఢిల్లీలో తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. జంతర్ మంతర్ ధర్నా చౌక్ వద్దకు మాలలు అధికసంఖ్యలో తరలివచ్చి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వర్గీకరణకు పావులు కదిపి దళితులకు అన్యాయం చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలో మంద కృష్ణ మాదిగ మోసపోయి దళితులను వంచించారన్నారు. వర్గీకరణ తీర్పును సుప్రీం కోర్టు వెనక్కి తీసుకోవాలని, అప్పటి వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్లు బి.వెంకటేశ్వర్లు, గోపోజు రమేశ్, మన్నే శ్రీధర్, మధుకర్, జాతీయ కార్యదర్శి దమ్మ నారాయణ, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేశ్, నాయకులు రవికుమార్, తిరుపతి, రమేశ్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఆత్మహత్యాయత్నం

జన్నారం: జన్నారం మండలం పొనకల్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ వంగపల్లి శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పొనకల్ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్న వంగపల్లి శ్రీనివాస్ కొన్ని రోజులుగా అప్పుల బాధతో మానసికంగా బాధపడుతున్నాడు. గురువారం సాయంత్రం తన సొంత గ్రామమైనా బాదంపల్లి ఎల్లమ్మ ఆలయ సమీపంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయడంతో తాను బాదంపల్లి ఆలయం వద్ద ఉన్నానని ఆందోళనగా చెప్పడంతో అనుమానంతో అక్కడికి వెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితికి జన్నారంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అయితే అప్పులు ఇచ్చిన కొందరు వేధించడం వల్లే పురుగుల మందుతాగి చనిపోవాలను అనుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎస్సై రాజవర్ధన్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే తదుపరి విచారణ జరుపుతామన్నారు.



చికిత్స పొందుతున్న శ్రీనివాస్

వేధింపులతో వివాహిత ఆత్మహత్య

భీమిని: అదనపు కట్నం కోసం అత్తింటి వారి వేధింపులు భరించలేక ఓ వివాహిత బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెంది ఆడె లస్మయ్య, నాగుబాయి దంపతుల కుమార్తె రోజా (22)తో కన్నెపల్లి మండలంలోని నాయికినిపేటకు చెందిన నికడే రాజుకు 2022 డిసెంబర్‌లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.3 లక్షల నగదుతో పాటు ద్విచక్ర వాహనం, మూడు తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. వివాహమైన నెల తర్వాత అత్త నికోడే పద్మ, మామ పోచిమేర, ఆడపడుచు చెండే మౌనిక నిత్యం అదనపు కట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేశారు. పెద్దల సమక్షంలో పంచాయతీలు కూడా జరిగాయి. అయినా వేధింపులు ఆపకపోవడంతో పదిహేను రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబ సభ్యులు 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి 8 నెలల కుమారుడు ఉన్నాడు. ఏసీపీ రవికుమార్ వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి లస్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



రోజా(ఫైల్)

అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య

కౌటాల: అనారోగ్య సమస్యలతో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎన్.మధుకర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన టాకిరే హన్మంతు (69)కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. మృతుని కుమారుడు బాపురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంహెచ్‌ఆర్‌డీ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అజ్మీర వైష్ణవి ఎంహెచ్‌ఆర్‌డీ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ గురువారం తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో సదరు విద్యార్థిని ప్రతిభ కనబర్చడంతో ఎంపికై నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థినికి ఏడాదికి రూ.10 వేల చొప్పున ఐదు సంవత్సరాలపాటు స్కాలర్‌షిప్ అందించనున్నట్లు తెలిపారు. వైష్ణవిని ప్రిన్సిపాల్, లెక్చరర్లు అభినందించారు.



వైష్ణవి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

భీమారం: మండల కేంద్రంలోని వైన్స్ షాపు వద్ద జరిగిన దాడి ఘటనలో ఒకరిపై గురువారం ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు. బుధవారం సాయంత్రం భీమారం-కొత్తపల్లి ప్రధాన రహదారిపై ఉన్న వైన్స్‌షాపు వద్దకు సంతోష్ తన స్నేహితులతో కలిసి కారులో వచ్చాడు. కారు దిగే క్రమంలో డోర్ తీస్తుండగా అటుగా బైక్‌పై వెళ్తున్న కోట విష్ణు, సెగ్యం అరుణ్‌కుమార్‌కు తాకింది. చూస్తూ డోర్ తీయవచ్చుకదా అని వారు సంతోష్‌ను అడగగా కులం పేరుతో దూషిస్తూ వారిపై దాడికి పాల్పడ్డాడని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు నాంపల్లి సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిరాణా షాపుల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారి విశ్వేశ్వర్

భీమారం: మండల కేంద్రంలోని కిరాణషాపుల్లో గురువారం సాయంత్రం జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి విశ్వేశ్వర్ తనిఖీ నిర్వహించారు. ఈమేరకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మార్పీ ధరలు, తయారీ తేదీలు లేకుండా సరుకులు అమ్ముతున్న 8 దుకాణాల యజమానులకు రూ.28 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేసే విధంగా సామాన్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్లు పి.శంకర్, టి.మల్లికార్జున్ పాల్గొన్నారు.

పట్టపగలే దాడి

• ఇంటి నిర్మాణంలో గొడవ
• కోర్టు కేసు పెండింగ్‌లో ఉండగానే పనులు
• ప్రహరీ కూల్చి వేసి మరీ నిర్మాణం
• అడ్డుకున్న ఇంటి యజమానిపై దాడి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో గ్యాంగ్ దాడులు, అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఓ వైపు పోలీసు యంత్రాంగం అక్రమ దందాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతున్నా అడ్డుకట్ట పడడం లేదు. ఈ నెల 7న మంచిర్యాలలోని మారుతినగర్‌లో పట్టపగలే ఓ ఇంటి ప్రహరీ కూల్చివేసి అక్రమంగా నిర్మాణం చేపట్టిన ఘటనలో ఇంటి యజమానిపై సుమారు 30 మంది దాడి చేసి గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. మారుతినగర్‌కు చెందిన టి.ప్రతాప్‌రెడ్డి, భాగ్యలక్ష్మి 2001లో నకిరెకొమ్ముల కుమారస్వామి, పల్లెర్ల లక్ష్మీనారాయణ వద్ద సర్వేనంబరు 273/అ మంచిర్యాల శివారులో భూమి కొనుగోలు చేసి 2006లో మున్సిపల్ అనుమతి పొంది ఇంటి నిర్మాణం చేశాడు. 2015, 2016లో అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తి ప్రతాప్‌రెడ్డి ఇంటి పక్కనే ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేసి 2021 మార్చిలో ఇల్లు నిర్మిస్తుండగా.. ప్రతాప్‌రెడ్డి ఇంటి ప్రహరీ 70 శాతం కూలడంతో వారం రోజుల్లో నిర్మించి ఇస్తానని రాసిచ్చాడు. ఒప్పందం ప్రకారం నిర్మించకపోవడంతో కోర్టుకు వెళ్లి ఎలాంటి అనుమతి లేకుండా రాత్రికి రాత్రే పూర్తి స్థాయి ప్రహరీని కూల్చివేయడంతో ప్రతాప్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో అజీజ్‌పై కేసు నమోదైంది. ఇద్దరి మధ్య కోర్టు వివాదం పెండింగ్‌లో ఉంది. ఈ నెల 7న 30 మంది కూలీలతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. అడ్డుకునేందుకు వెళ్లిన ప్రతాప్‌రెడ్డి, ఆయన భార్య భాగ్యలక్ష్మిపై దౌర్జన్యానికి దిగి దాడి చేశారు. ప్రతాప్‌రెడ్డి కాలు విరుగగా భాగ్యలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. కొందరు కత్తులు పట్టుకుని దాడికి యత్నించినట్లు బాధితులు తెలిపారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు రావాలని ఆదేశించడంతో ప్రతాప్‌రెడ్డి దంపతులు వెళ్లారు. అబ్దుల్ అజీజ్ రాకపోవడం గమనార్హం. దాడి ఘటనపై స్థానిక సీఐ బన్సీలాల్‌ను సంప్రదించగా ఇద్దరి మధ్య ప్రహరీ వివాదం ఉందని, మున్సిపల్ కమిషనర్‌కు రాశామని తెలిపారు.



దాడికి సంబంధించిన సీసీ ఫుటేజీ చిత్రం



చేతిలో కత్తి పట్టుకొని దాడికి యత్నించిన వ్యక్తి



దాడిలో గాయపడిన ప్రతాప్‌రెడ్డి

ఎస్టీపీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న రియాజ్ అహ్మద్

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం సింగరేణి డైరెక్టర్(ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు, డైరెక్టర్(పా) శ్రీనివాస్‌లకు కొత్తగూడెంలో వినతిపత్రం అందజేశారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లను కలిసి కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. ప్రధానంగా ఇతర పవర్ ప్లాంట్ల మాదిరి ఇక్కడ కూడా కార్మికులకు అలవెన్సులు, వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఎస్టీపీపీ ప్రధాన కార్యదర్శి విక్రమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణరెడ్డి, నాయకులు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలి

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి ఉన్న రూ.27 వేల కోట్లు వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్కే 5 గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం సంస్థ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వాలకు మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసం వినియోగించాలన్నారు. కార్మికులకు 2 గుంటల ఇంటిస్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సంస్థకు వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి 35 శాతం వాటా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, పిట్ కార్యదర్శులు గునిగంటి నరసింగారావు, రాంచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు సురేష్, సత్యనారాయణ, లక్కిరెడ్డి సత్తిరెడ్డి, జీపీ రావు, దేవేందర్ పాల్గొన్నారు.

మీరూ మీ వార్డ్రోబ్ లేదా మీ అమ్మాయి వార్డ్రోబ్ గురించి, డ్రెస్సింగ్ విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను ఫొటోలతో సహా 'సాక్షి' పాఠకులతో పంచుకోవచ్చు. బాగున్న వాటిని మై వార్డ్రోబ్ శీర్షికన ప్రచురిస్తాం. మా చిరునామా: మై వార్డ్‌రోబ్ , సాక్షి ఫ్యామిలీ, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34. sakshifamily3@gmail.com

• అభిప్రాయం



'అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలాహ్యారిస్ గెలుస్తుంది. ఆమె గెలుపు మహిళాశక్తిని నిరూపిస్తుంది' అంటున్నారు **లత మంగిపూడి.** అమెరికాలోని న్యూహ్యాంప్‌షైర్‌కు డెమోక్రటిక్ పార్టీ లెజిస్లేటర్‌గా ఉన్న లత ప్రస్తుతం కమలా హ్యారిస్ గెలుపు కోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారు. అమెరికా మహిళల గురించి స్త్రీలకు ఉండాల్సిన దృక్పథం గురించి ఆమె తన అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

హ్యారిస్ గెలిచి మహిళాశక్తిని గెలిపిస్తుంది

'ఒక విధంగా చెప్పాలంటే అమెరికాలో ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి. అమెరికన్స్ మరోసారి ట్రంప్ నియంతృత్వ పాలనను అంగీకరించేందుకు ఏ మాత్రం సిద్ధంగా లేరు. కమలా హ్యారిస్ గెలిస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ. అందుకే 'సేవ్ అవర్ డెమోక్రసీ' అనే నినాదంతో మేం ప్రజల్లోకి వెళ్తున్నాం. కమలా హ్యారిస్ అమెరికా మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపడతారని బలంగా నమ్ముతున్నాను' అన్నారు లత మంగిపూడి.

మైసూరుకు చెందిన లత రాజమండ్రికి చెందిన కృష్ణ మంగిపూడిని వివాహం చేసుకోవడంతో ఆంధ్రప్రదేశ్ వాసి అయ్యారు. 1985లో యూఎస్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అనంతరం యూఎస్ ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ న్యూహ్యాంప్‌షైర్ చాప్టర్‌కు 2006 నుంచి 2013 వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగారు. అలా ఆమె రాజకీయ జీవితం మొదలైంది. అప్పటి అధ్యక్షుడు ఒబామా, హిల్లరి క్లింటన్ వంటి ప్రముఖులతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత 2013 నుంచి ఇప్పటివరకు నాషువా నుంచి లెజిస్లేటర్‌గా గెలుపొందుతూనే ఉన్నారు. కమలాహ్యారిస్ గెలుపు కోసం హోరాహోరీగా ప్రచారం కొనసాగిస్తూ పర్యటనలు చేస్తున్నారు.



స్త్రీల హక్కులకు విఘాతం

'ప్రపంచంలో ఏ మహిళకైనా తన శరీరంపై తనకు పూర్తి హక్కు ఉండాలి. ఆమె తన ఆరోగ్యాన్ని కాపాడుకొనే అవకాశం ఉండాలి కదా. కానీ అమెరికాలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లల్ని కనాలా, వద్దా అనే అత్యంత కీలకమైన అంశంపైన మహిళలు తమ హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గర్భం దాల్చిన తరువాత తప్పనిసరిగా బిడ్డను కనాల్సిందే. కానీ బిడ్డను కనేందుకు ఆమె మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యరీత్యా సంసిద్ధంగా ఉండాలి. ఇది బిడ్డను కనాల్సిన తల్లి, డాక్టర్ నిర్ణయించవలసిన విషయం. ఇందులో ప్రభుత్వ జోక్యం అవసరం లేదు. కానీ బలవంతంగానైనా పిల్లలను కనాల్సిందేనడం సరి కాదు. అత్యాచారానికి గురైన వారు, లైంగిక దాడుల వల్ల గర్భవతులైన వాళ్లు కూడా బిడ్డల్ని కనాలంటే ఎలా? అమెరికా మహిళలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న ఈ అంశంపై డెమొక్రటిక్ పార్టీ స్పష్టమైన వైఖరిని కలిగి ఉంది. మా పార్టీ గెలిస్తేనే మహిళల హక్కులకు రక్షణ లభిస్తుంది' అన్నారామె.

ఇంకా వివక్షేనా....

'విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు లభించడం లేదు. స్త్రీలు తీవ్ర నిర్లక్ష్యానికి, వివక్షకు గురవుతున్నారు. చివరకు కొన్నిచోట్ల ఓటు హక్కును కూడా వినియోగించుకోలేని పరిస్థితి. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకొనే వాతావరణానికి రిపబ్లికన్ పార్టీ విఘాతం కలిగిస్తోంది. ముఖ్యంగా కొత్తగా ఓటుహక్కును పొందిన వాళ్లు, ఇమ్మిగ్రెంట్స్, కొన్నిచోట్ల మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకొనే అవకాశం లేదు. ఆ పార్టీ మరోసారి గెలిస్తే ఓటుహక్కు మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందుకే ఈసారి మహిళా గెలుపు ప్రజాస్వామిక గెలుపు' అని ముగించారామె.

- పగిడిపాల ఆంజనేయులు
సాక్షి, హైదరాబాద్

మై వార్డ్‌రోబ్



హస్త కళలపై ఇష్టంతో చిత్రలేఖనం, బ్లాక్ ప్రింటింగ్ నేర్చుకుంది. చదివింది ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్. చేనేత కారులకు అండగా ఉండాలని చర్ఖా సంస్థను ప్రారంభించింది. మువ్వన్నెల జెండా రంగులు... మధ్యన మన సంస్కృతికి చిహ్నమైన ముగ్గును చిత్రించి, చేనేత వస్త్రంతో కండువాను డిజైన్ చేసింది. పేటెంట్ హక్కునూ పొందింది. తన హ్యాండ్లూమ్ చీరలను ధోతీ కట్టులా డిజైన్ చేసి, వాటినే తన రోజువారీ డ్రెస్‌గా మార్చుకుంది. సికింద్రాబాద్ మారేడుపల్లిలో ఉంటున్న ప్రతిమ రాపర్తి తన వార్డ్‌రోబ్‌ను సరికొత్తగా మార్చుకుంది.

ధోతీ కట్టు
మూడు రంగుల్లో ముగ్గు

'ప్రపంచానికి కాటన్ దుస్తులను మన దేశమే పరిచయం చేసింది. మనదైన సంస్కృతిని మనమే పరిచయం చేసుకోవాలి. అలాగే మనల్ని అందరూ గుర్తించాలి. ఈ ఆలోచనే చేనేతలకు దగ్గరగా ఉండేలా చేసింది. 2018లో 'చర్ఖా' పేరుతో చేనేతలకు మద్దతుగా నిలవాలని సంస్థను ప్రారంభించాను.

ట్రై కలర్స్‌లో ముగ్గు

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ట్రై కలర్స్ డ్రెస్ ధరించి వెళ్లడానికి చాలా కష్టపడేదాన్ని. ఆరెంజ్, బ్లూ, గ్రీన్ కలర్స్ ఉండేలా డ్రెస్సింగ్ చేసుకునేదాన్ని. అలా కాకుండా ఆ రోజుకి ఏదైనా ప్రత్యేకమైన యునిఫామ్ ఉంటే బాగుంటుంది అనుకున్నాను. చేనేత క్లాత్‌ను ఎంపిక చేసుకొని, అంచుగా వాటికి నేచురల్ కలర్స్‌ని జత చేశాను. మూడు రంగుల మధ్యలో ఉండే ధర్మచక్ర మన అడ్మినిస్ట్రేషన్‌కి, విజడమ్‌కి ప్రతీక. ధర్మచక్రను మన డ్రెస్సుల్లో వాడకూడదని, దాని బదులుగా ముగ్గు డిజైన్ చేశాను. ముగ్గు అనేది మన సంస్కృతికి, స్త్రీల కళా హృదయానికి ప్రతీక.

25 చుక్కలు...

మధ్య చుక్క ఈ డ్రెస్ ఎవరు ధరిస్తారో వారికి ప్రతీక. మిగతా 24 చుక్కలు మన పూర్వీకులు, కాలానికి ప్రతీకగా అనుకోవచ్చు. అలాగే, ఆ చుక్కలన్నీ కలుపుతూ వెళితే మన సమాజ వృద్ధికి, రాబోయే తరానికి సూచికగానూ ఉంటాయి. ఈ డిజైన్‌ని కండువా, శారీ, ధోతీ, ఘాఘ్రా చోళీకి తీసుకున్నాను. దీనికి పేటెంట్ రైట్ కూడా తీసుకున్నాను. ఈ డిజైన్ కండువాను ఎవరైనా ధరించవచ్చు.

చేనేత చీరలతో ధోతీ కట్టు

నా దగ్గర ఎక్కువగా ఉన్న హ్యాండ్లూమ్ చీరలని ప్రత్యేక కట్టుగా మార్చుకోవాలనుకున్నాను. సౌకర్యంగా ఉండేలా చీరలను ధోతీగా కన్వర్ట్ చేసుకున్నాను. సెల్, మనీ, కార్డ్స్ పెట్టుకోవడానికి ఈ ధోతీకి పాకెట్స్ కూడా ఉంటాయి. పూర్వం రోజుల్లో గోచీకట్టు చీరలను వాడేవారు. ఆ డిజైన్ ప్రతిఫలించేలా నాకు నేను కొత్తగా డిజైన్ చేసుకున్న డ్రెస్సులివి. టూర్లకు, బయటకు ఎక్కడకు వెళ్లినా ఇలాంటి డ్రెస్‌తోనే వెళతాను. నాకు నేను ప్రత్యేకంగా ఉండాలనుకుంటాను. వీవర్స్, టైలర్స్, బ్లాక్‌ప్రింట్, హ్యాండ్‌క్రాఫ్ట్స్ వారితో కలిసి వర్క్ చేస్తాను. ఇకో ఫ్రెండ్లీ హ్యాండీ క్రాఫ్ట్, టైలరింగ్, పెయింటింగ్... వంటివి గృహిణులకు నేర్పిస్తుంటాను'' అని వివరించారు ప్రతిమ.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



• ఒలింపిక్ లెజెండ్

సింహం మెడలో మేక...

విమర్శలకు చాలా మంది కుంగిపోతుంటారు. అమెరికన్ ఆర్టిస్టిక్ జిమ్నాస్ట్ అయిన సిమోన్ అరియన్నే బైల్స్ ఓవెన్స్ మాత్రం విమర్శలనే సవాల్‌గా తీసుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇటీవల జరిగిన ఆల్‌రౌండ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. దీంతో తొమ్మిది ఒలింపిక్ పతకాలు, 30 ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు ఆమె ఖాతాలో చేరి, ప్రపంచంలోనే అత్యధిక ఒలింపిక్ పతకాలు సాధించిన ఐదవ మహిళా ఒలింపిక్ జిమ్నాస్ట్‌గా పేరొందిందామె. 27 ఏళ్ల సిమోన్ విజయం సాధించిన వెంటనే తన మెడలో మేక లాకెట్టుతో ఉన్న చైన్‌ను బయటకు తీసి అందరికీ చూపించింది. 'చాలా మంది నన్ను 'గోట్' అని పిలుస్తుంటారు. నేను దానిని నెగిటివ్‌గా తీసుకోలేదు. ఈ గోట్‌లో కూడా ప్రత్యేకత ఉంది, అది ప్రపంచానికి చూపించాలనుకున్నాను. అందుకే 'స్టఫ్డ్ గోట్'ను హారంగా మెడలో ధరించాను' అంటూ గోట్ లాకెట్‌ను చేత్తో పట్టుకొని చూపిస్తూ అంది సిమోన్ బైల్స్.

తొమ్మిదవ ఒలింపిక్ పతకాన్ని, ఆరవ స్వర్ణాన్ని సంపాదించినందుకు సిమోన్ ప్రదర్శనలో అభినందనలు దక్కాయి. అయితే, 2021లో జరిగిన టోక్యో గేమ్స్ నుండి చివరి నిమిషంలో వైదొలగడంతో ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆమె చేష్టల కారణంగా మరొక క్రీడాకారిణికి అవకాశం లేకుండా పోయిందని, జాత్యహంకారం, సెక్సిస్ట్, ట్రాన్స్‌ఫోబిక్, డ్రగ్ చీట్... అని ఎంతో మంది చేత నాడు విమర్శలను ఎదుర్కొంది. దీంతో కుటుంబంలో వచ్చిన సమస్యలు, మానసిక సమస్యలతో పోటీల నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. అయినా ఆమెపైన విమర్శలు ఆగలేదు. ఆ సందర్భంలో ఆమెను 'గోట్' అంటూ హేళన చేశారు. అదే ఆమె ఇప్పుడు తన బలంగా మార్చుకుని, దాంతోనే పతకాన్ని సాధించ గలిగింది.



యుద్ధం చేసిన గాయంతో ఇంకా ఆ దేశం కన్నీరు కారుస్తూనే ఉంది. బాంబులు, బుల్లెట్లు చిందించిన రక్తంతోనే అక్కడి ప్రజలు ఇప్పటికీ సూర్యోదయాన్ని చూస్తున్నారు. రష్యా దురాక్రమణతో ఉక్రెయిన్ ధ్వంసమయ్యి రెండేళ్లు దాటింది. కాని ఆ దేశ క్రీడాకారుల మనోబలాన్ని మాత్రం యుద్ధం దెబ్బతీయలేకపోయింది. మీరు మాపై తుపాకులు ఎక్కుపెట్టి యుద్ధం చేస్తే.. మేం బంగారు పతకాలతో శాంతి సందేశాన్ని అందిస్తామంటూ ప్రపంచానికి సగర్వంగా చాటి చెబుతున్నారు ఉక్రెయిన్ క్రీడాకారులు. హై జంప్‌లో బంగారు పతకం సాధించిన 22 యేళ్ల యారోస్లావా మహుచిక్ వారిలో ఒకరు.

నిలువనీడ లేకపోయినా...

ప్రశాంతంగా సాగుతున్న యారోస్లావా జీవితాన్ని యుద్ధం ఆందోళనలో పడేసింది. నిత్యం దూసుకొచ్చే క్షిపణులు ఆమెకు రెండున్నరేళ్లుగా నిలువ నీడలేకుండా చేశాయి. తూర్పు ఉక్రెయిన్‌లోని సొంతూరు నిప్రో నుంచి బయటపడి వివిధ దేశాల్లో తలదాచుకుంది. తల్లీతండ్రి అక్క అప్పుడప్పుడూ తనను కలిసేందుకు వచ్చేవారు. వారిని చూశాక ఆమె మనసు మరింత కకావికలమయ్యేది. వారు వెళ్లిపోయాక ఏ క్షణాన ఏ వార్త వినాల్సిందోనన్న భయం ఆమెను వెంటాడేది. ఇంట్లో ఉన్నపుడు పక్కన బాంబులు పడుతుంటే 'నాన్నా బేస్‌మెంట్‌లోకి వెళ్దామా అంటే.. ఇంకా భయపడి పారిపోవడంలో అర్థం లేదు. నాలాగే ఎంతోమంది ప్రాణాల మీద ఆశలు వదిలేసుకునే బతుకుతున్నారు తల్లీ' అన్న తండ్రి మాటలు వద్దంటున్నా గుర్తుకువచ్చేవి. యుద్ధం ఆమెను వెంటాడుతూనే ఉండేది. నేలకొరుగుతున్న దేశ సైనికులు..రోడ్డున పడుతున్న ఉక్రెయిన్ ప్రజలు కళ్ల ముందు కదులుతూనే ఉన్నారు. వాటి మధ్యే ఆమె శిక్షణ కొనసాగిస్తూ వచ్చింది.



విషాదగీతాలు మరిచేలా...

స్లీపింగ్ బ్యాగ్, యోగా మ్యాట్‌ను ఎప్పుడూ తనతో తెచ్చుకునే మహుచిక్ ఆట విరామ సమయంలో స్టేడియంలో విశ్రాంతి తీసుకుంటూ ఆకాశంలోకి చూస్తూ దేశం గురించే ఆలోచించేది. యుద్ధ విషాద గీతాలు మరుగున పడేలా ప్రజల్లో చైతన్యం నింపేలా దేశానికి పతకం అందించాలని కలలు కనేది. హైజంప్ మ్యాచ్‌లో ప్రత్యర్థితో తలపడే సమయంలోనూ ఆమె మనసు నిండా యుద్ధ దృశ్యాలే. చివరకు ఆమె పోరాట స్ఫూర్తి గెలిచింది. ఎంతటి భీకర యుద్ధమైనా ఆశలను, ఆశయాలను తుడిచిపెట్టేయలేదని నిరూపించింది. వ్యక్తిగత హోదాలో దేశానికి ఆమె సాధించిపెట్టిన తొలి గోల్డ్‌మెడల్ ఉక్రెయిన్ ప్రజల భవిష్యత్తుకు నిజంగా ఓ ఆశా కిరణమే. యారోస్లావా మహుచిక్ ఒక్కరే కాదు.. పారిస్ ఒలంపిక్స్‌లో పతకాలు సాధిస్తున్న ఇతర ఉక్రెయిన్ క్రీడాకారులు యుద్ధం కారణంగా నిస్సత్తువగా మారిన ఆ దేశ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఇంతకాలం యుద్ధం కారణంగా రక్తంతో తడిసిన దేశంలో పతకాల సుమాలు పూయిస్తున్నారు.

ఒలింపిక్స్ జరుగుతున్నా...

''ఒలింపిక్ క్రీడలు శాంతి సందేశాలు. కానీ రష్యా ఇలాంటి క్రీడలు జరుగుతున్న సమయంలోనూ మా దేశంపై దాడులు ఆపకపోగా మరింత ఉధృతం చేసింది. చిన్నపిల్లల ఆసుపత్రిపై క్షిపణులు కురిపించడంలోని క్రౌర్యం మాటలకందనిది'' అంది యారోస్లావా మహుచిక్.

ఒలింపిక్స్ క్రీడాకారులు
ఏం తినాలి! ఎంత తినాలి!!

ఒలింపిక్స్ క్రీడాకారుల ఆహారం చాలా నిశితమైన పరిశీలనతో డిజైన్ చేస్తారు. వాళ్ల ఆరోగ్యం, సంబంధిత క్రీడకు అవసరమైన మోతాదులో పోషకాలు సమృద్ధిగా అందేలా ఆహారం ఉంటుంది. కేలరీలు, కార్బోహైడ్రేట్‌లు, ప్రొటీన్‌లు, ఫ్యాట్స్ వంటి మ్యాక్రో న్యూట్రియెంట్స్, ఐరన్, క్యాల్షియం, విటమిన్ డీ, మెగ్నీషియం, ఎలక్ట్రొలైట్స్ (సోడియం, పొటాషియం, క్లోరైడ్) వంటి మైక్రో న్యూట్రియెంట్‌లు అందాలి. క్రీడాకారుల డైట్‌లో దేహానికి ఒక రోజుకు అవసరమైన కేలరీలలో 55–65 శాతం కార్బోహైడ్రేట్‌ల రూపంలోనే ఉంటుంది. శ్రమను బట్టి రోజుకు 2 వేల నుంచి 10 వేల కేలరీల వరకు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రొటీన్‌లు దేహం బరువును బట్టి కేజీకి 1.2 నుంచి 2 గ్రాములు అందాలి. ఆరోగ్యకరమైన ఫ్యాట్ శక్తినివ్వడంతో పాటు హార్మోన్ ఉత్పత్తికి దోహదం చేస్తుంది. దేహానికి అందాల్సిన కేలరీల్లో 20 నుంచి 30 శాతం ఫ్యాట్ రూపంలో ఉండాలి. మారథాన్, స్విమ్మింగ్‌కి శిక్షణ నిడివి ఎక్కువ ఉంటుంది. క్రీడను బట్టి కూడా పోషకాల అవసరం మారుతుంది.

హెల్దీ డైట్



వంద గ్రాములు... మనదేశానికి ఒక బంగారు పతకాన్ని దూరం చేసింది. బంగారు పతకంతో పాటు బంగారంలాంటి క్రీడాకారిణి మనోధైర్యాన్ని దెబ్బతీసింది. బరువు లెక్కలు ఇంత కచ్చితంగా పాటించే ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తీసుకునే ఆహారం ఎలా ఉండాలనే వివరాలను అందించారు న్యూట్రిషనిస్ట్, వెల్‌నెస్ కోచ్ డాక్టర్ కరుణ.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

హార్మోన్‌ల సమతుల్యత!

వీటన్నింటితోపాటు నిద్ర, ఒత్తిడి చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయి. క్రీడాకారిణులకు ఎనిమిది గంటల మంచి నిద్ర తప్పనిసరి. నిద్రలేనప్పుడు హార్మోన్‌ల సమతుల్యత లోపించడం, ఒత్తిడి, బరువు మీద ప్రభావం చూపిస్తుంది. ఒత్తిడిని ఎదుర్కోవడంలో మగవాళ్లకు మహిళలకు మధ్య తేడా ఉంటుంది. మానసికమైన ఒత్తిడి, భావోద్వేగాలు వారి సమర్థమైన ప్రదర్శన మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ పరిస్థితిని అధిగమించడానికి మెడిటేషన్, బ్రీత్ ఎక్సర్‌సైజ్, కృతజ్ఞత, క్షమ, పరిస్థితిని యథాతథంగా స్వీకరించడం వంటివి సాధన చేయాలి.

ఎప్పుడు తినాలి? ఎలా తినాలి?

ఆహారంతోపాటు హైడ్రేషన్, మీల్ టైమింగ్, వర్కవుట్‌కు రెండు – మూడు గంటల ముందు తీసుకోవాల్సిన ఆహారం, వర్కవుట్ సమయం గంటకు మించినప్పుడు మధ్యలో తీసుకోవాల్సిన తక్షణ శక్తినిచ్చే ఆహారం, వర్కవుట్ తర్వాత కండరాల పునర్నిర్మాణం కోసం తీసుకోవాల్సిన ఆహారం మోతాదులు స్పష్టంగా నిర్దేశితమై ఉంటాయి. అయితే బాడీ కంపోజిషన్, మెటబాలిక్ రెస్పాన్స్, ఫుడ్ ఇన్‌టాలరెన్స్ వ్యక్తికీ వ్యక్తికీ మారుతుంటాయి. కాబట్టి సాధారణ నియమావళిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్క స్పోర్ట్స్‌పర్సన్‌కి వ్యక్తిగత డైట్ ప్లాన్ సిద్ధం చేయాలి. అలాగే వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్, వీగన్ వంటి వారి వ్యక్తిగత ఆహార విశ్వాసాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఐరన్: రెడ్ మీట్, ఆకు కూరలు, ధాన్యాల ద్వారా శక్తితోపాటు దేహభాగాలకు ఆక్సిజన్ సమర్థంగా అందుతుంది.
క్యాల్షియమ్: వెన్న తీయని పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు ఎముకల పటుత్వానికి దోహదం చేస్తాయి.
విటమిన్–డీ: కొవ్వుతో కూడిన చేపలు, తృణధాన్యాలు, సూర్యరశ్మి ద్వారా ఎముకల పటుత్వంతోపాటు వ్యాధినిరోధకత మెరుగవుతుంది.
మెగ్నీషియం: నట్స్, సీడ్స్, పొట్టుతీయని ధాన్యాలు, ఆకుకూరలు శక్తిని పెంచడంతోపాటు కండరాల సంకోచవ్యాకోచాలను సులువు చేస్తాయి.
ఎలక్ట్రోలైట్స్: పండ్లు, కూరగాయలు, పాలు, పాల ఉత్పత్తులు, స్పోర్ట్స్ డ్రింక్‌లు దేహంలో ద్రవాల స్థాయులను క్రమబద్ధీకరించడంతోపాటు కండరాల పనితీరును మెరుగుపరుస్తాయి.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మోటారు పాఠం.. జపాన్ చేర్చుతోంది!

• సకుర సైన్స్ ఫెస్టివల్‌లో కరీంనగర్ బాలికకు చోటు

బోటనీ పాఠమంటే.. బోరు..బోరు.. హిస్టరీ రొస్టు కంటే రెస్ట్ మేలు.. అని పాడుకుంటే పొరపాటే.. పాఠం సరిగా వింటే విదేశీయానం, విమానమెక్కే యోగం దక్కుతుందని నిరూపించింది కరీంనగర్ జిల్లా శంకరపట్నంకు చెందిన నబా మొహమ్మదీ. ఇటీవల హైదరాబాద్‌లో ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఏకంగా ఈ ఏడాది నవంబరులో జపాన్‌లో జరిగే సకుర సైన్స్ ఫెస్టివల్ లో పాల్గొనబోతోంది. ఇదంతా ఎలా సాధ్యమైంది? కేవలం సైన్స్ మీద ఉన్న ఆసక్తి.. మోటారు పాఠం వినడం వల్లే అంటుంది. నబా..! తనకు సైన్స్‌పై ఉన్న ఆసక్తి తనను జపాన్ గడ్డపై కాలు మోపేలా చేస్తుందని 'సాక్షి'కి చెప్పింది.



ఏంటా మోటారు కథ...!

నబా ప్రస్తుతం శంకరపట్నంలోనే ఇంటర్ సెకండియర్ చదువుతోంది. దాదాపు నాలుగేళ్ల క్రితం తాను 9వ తరగతిలో ఉండగా.. విన్న ఫిజిక్స్ పాఠం తన ఆలోచన తీరును మార్చివేసింది. 8 వ తరగతి వరకు బేసిక్ సైన్స్ విన్న తాను.. తొలిసారిగా మోటారు ఎలా పనిచేస్తుందో తన గురువులు చెప్పిన పాఠానికి ముగ్ధురాలైంది. విద్యుచ్ఛక్తి, అయస్కాంత శక్తిని కలిపి మోటారు నడిపే విధానం తెలుసుకోవడం తనకు సైన్స్ ఉన్న ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిన్న సూత్రం ఆధారంగా ప్రపంచంలోని ఎన్నో మోటార్లు ఎలా నడుస్తున్నాయన్న విషయంపై తనకు పూర్తి అవగాహన వచ్చింది. అది మొదలు సైన్స్‌పాఠాలను మరింత శ్రద్ధగా చదువుతూ విశ్లేషణ చేసుకునేది. ప్రతీది తనకు అర్థమయ్యేందుకు అదనపు పుస్తకాలు, యూట్యూబ్ చూసేది. ఇటీవల జిల్లా స్థాయిలో ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో కరీంనగర్ నుంచి మొదటి స్థానంలో నిలిచింది. అదే ఊపులో రాష్ట్రస్థాయికి ఎంపికై టాప్–5లో టాప్–2 స్థానం దక్కించుకుంది. ఫలితంగా నవంబరులో జపాన్‌లో జరిగే సుకుర సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనే అరుదైన అవకాశం చేజిక్కించుకుంది.

తాను కూడా ఏదైనా సాధించాలంటే..!

అదే ఉత్సాహంతో తాను కూడా ఏదైనా సాధించాలని తలచింది. అంధులకు దారి చూపేందుకు ప్రత్యేక డివైజ్ రూపొందించింది. ఇది ప్రస్తుతం ప్రోటోటైప్ దశలోనే ఉంది. దీన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. దీనికి త్వరలోనే పేటెంట్ కూడా దరఖాస్తు చేసుకుంటానని నబా 'సాక్షి'కి వివరించింది. జపాన్ పర్యటనలో అక్కడ శాస్త్ర సాంకేతిక రంగాలను గమనించి, వాటిని ఇక్కడఅమలు చేసేందుకు ప్రయత్నిస్తానని తెలిపింది. తాను ఈ ప్రగతి సాధించడం వెనక తన తండ్రి షబీర్, ఫిర్దోస్ సుల్తానాలు ఎంతో ప్రోత్సహించారని, సంప్రదాయ కుటుంబమైనా, బాలికనైన తనను అన్ని కాంపిటీషన్లకు పంపించారని తెలిపింది. అదే సమయంలో తనకు పాఠాలు చెప్పిన గురువులకు తానెప్పుడూ రుణపడి ఉంటానని, పెద్దయ్యాక శాస్త్రవేత్తనవుతాననీ, అంధులకు చూపునవుతాననీ వారికి దారి చూపేందుకు రూపొందించిన ఉపకరణాన్ని మరింత అభివృద్ధి చేస్తాననీ చెప్పింది. భవిష్యత్తులో శాస్త్రవేత్తగా ఎదగడమే తన కల అని వివరించింది నబా.

- బి. అనిల్‌కుమార్,
సాక్షి ప్రతినిధి, కరీంనగర్